

కండ్లకోయలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

# నవంబర్ 30న వేలుకు ఇంక్
# డిసెంబర్ 3న తెలంగాణ అంతా పింక్

- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మరు
- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

మేడ్చల్ రూరల్, అక్టోబర్ 30: నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి రాష్ట్ర ప్రజలు తెలంగాణలో బీఆర్ఎస్‌ను గెలిపిస్తున్నారని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. నవంబర్ 30న మనందరి వేలుకు ఇంకు, డిసెంబర్ 3న తెలంగాణంతా పింకు అంటూ తనదైన శైలిలో కార్యకర్తల్లో జోష్ నింపారు. మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల బీఆర్ఎస్ బూత్ కమిటీల సమావేశం సోమవారం కండ్లకోయలోని నిమ్మల గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. సీఎం కేసీఆర్ తెలంగాణను పదేండ్లలో దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేశారని తెలిపారు. సీఎం పాలనలో సాగు, తాగు నీరు, కరంట్, వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారన్నారు. ప్రచారంలో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు అభివృద్ధి, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఉన్న అంశాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే నాయకులకు ప్రజలు గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. గెలిచిన నాటి నుంచి ఏనాడు నియోజకవర్గానికి రాలేదని, అలాంటి వ్యక్తి నేడు కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రేవంత్‌రెడ్డిది బ్లాక్‌మెయిల్ చరిత్ర అని, ఆయన సీఎం అవుతానంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరన్నారు.

### కాంగ్రెస్ అంటే ఓ దరిద్రం...

కాంగ్రెస్ పాలనలో నీళ్లు ఇచ్చిన పాపాన పోలేదని, కరెంట్, పింఛన్‌లు ఇవ్వలేదని మంత్రి మల్లారెడ్డి అన్నారు. నాడు పింఛన్‌లు కేవలం రెండు వందలు మాత్రమే ఇచ్చేవారని, అది కూడా ఒకరు చనిపోతేనే మరొక్కరికి వచ్చేవన్నారు. కాని నేడు బీఆర్ఎస్ హయంలో ఆసరా పింఛన్‌లు రెండు వేలు వస్తున్నాయని, వచ్చే జనవరి తర్వాత మూడు వేలు వస్తుందని చెప్పారు.

### బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి..

ఘట్‌కేసర్: బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో దాదాపు 150 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించి, ఆర్‌జీకేలో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిని చూసే ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేసి సీఎం కేసీఆర్‌ను మరోసారి బలపర్చాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు.



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జీడిమెట్ల, అక్టోబర్ 30: బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఉన్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. సోమవారం సుభాష్‌నగర్ డివిజన్ ప్రజా ఆశీర్వాద సభ సూరారం కాలనీ భీమా గార్డెన్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుల, మతాల పేరుతో ప్రజల మధ్యకు వచ్చి రెచ్చగొడుతున్న నాయకులకు గుణపాఠం చెప్పాలన్నారు. నెల రోజులు కష్టపడి భారీ మెజార్టీతో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ను గెలిపించాలని కోరారు. మహిళలు, యువకులు ఎన్నికల ప్రచారంలో ముందుండాలన్నారు. 100 ఓట్లకు ఒక ఇన్‌చార్జి చొప్పున నియమించుకుని ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ జి.సురేశ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజు, వినోద్, రంగారావు, యూసుఫ్, రమణ, డాక్టర్ హుస్సేన్, బాల్‌రాం రెడ్డి, పద్మ, పద్మలతా రెడ్డి, శేషు, శివగౌడ్, మంగ, సతీశ్ రెడ్డి, ఎంఎస్.వాసు, లక్ష్మీనారాయణ, మౌనిక, రాజశేఖర్ పాల్గొన్నారు.



తారానగర్ వాణిజ్య సముదాయంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

## శేరిలింగంపల్లిలో ఇంటింటికీ బీఆర్ఎస్

శేరిలింగంపల్లి/కొండాపూర్, అక్టోబర్ 30: శేరిలింగంపల్లిలో భారీ మెజారిటీతో గెలిచి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని తారానగర్‌లో ఇంటింటికీ బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి తుల్జాభవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఉన్న సంక్షేమ పథకాలను గెలిచిన తరువాత అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సమక్షంలో చందానగర్ డివిజన్ పరిధిలోని శివాజీ నగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్, బీజేపీల నాయకులు, కార్యకర్తలు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు ఉరిటి వెంకట్రావ్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

## మౌలిక వసతులకు పెద్దపీట

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

బేగంపేట, అక్టోబర్ 30 : బేగంపేట్‌లో తొమ్మిదిన్నరేండ్లలో 90 శాతం సమస్యలను పరిష్కరించామని కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట్ డివిజన్ ఫంక్షన్ విల్లాలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో మౌలిక వసతులకు పెద్దపీట వేశానన్నారు. తాను మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ముంపు ప్రాంతమైన బేగంపేట్‌కు ఓ సారి పడవలో వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అటువంటి ప్రాంతంలో కోట్లాది రూపాయలతో నాలా ప్రక్షాళన చేపట్టి సమస్యను పరిష్కరించామన్నారు. కేసులకు భయపడకుండా హెచ్‌పీఎస్ ఆధీనంలో ఉన్న స్థలాన్ని శ్మశాన వాటిక కోసం కేటాయించి ఏళ్లనాటి సమస్యను తీర్చామన్నారు. ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో బీజేపీ నాయకులు అడ్డుకున్నప్పటికి సివరేజ్, రోడ్డును నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి, నాయకులు శ్రీహరి, సురేశ్ యాదవ్ పాల్గొన్నారు.



బేగంపేట్‌లో జరిగిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరికలు



మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిన బీజేపీ నాయకులు

జీడిమెట్ల, అక్టోబర్ 30: ప్రగతి భవన్‌లోని మంత్రి కేటీఆర్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం.. సుభాష్‌నగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి కేటీఆర్ , ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.ఎస్.వాసు, బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణ, బీజేపీ మేడ్చల్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి రెడ్డి, ఆదర్శనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.వి.ఎన్.చారి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ సోషల్ మీడియా కో కన్వీనర్ ఎస్.కె. అనౌక్, సుభాష్‌నగర్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు వెంకటరత్నం, ఎంఎస్ వాసు యువసేన అధ్యక్షులు పి.మారుతీనాయుడు ఉన్నారు.

## ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

**అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి**



ఆనంద్‌బాగ్‌లో ప్రచారం చేస్తున్న మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, అక్టోబర్ 30 : ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మల్కాజిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్, గౌతంనగర్, నేరేడ్‌మెట్, వెంకటాపురం డివిజన్లలో అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి ఇంటింటికీ ప్రచారం చేసి, పలు సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంత సమస్యలు పరిష్కరించడంతో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. వరదముంపు కాలనీలను గుర్తించామని, ఎన్నికల తర్వాత మొదటి ప్రాధాన్యతగా పనులు చేపడతామన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం గట్టాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మీనాఉపేందర్ రెడ్డి, సబితాకిశోర్, సునీతారాము యాదవ్, శాంతిశ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నర్సింగరావు, అనిల్‌కిశోర్, రాముయాదవ్, ఉపేందర్ రెడ్డి, అమీనుద్దీన్ పాల్గొన్నారు.

## నామినేషన్ నాటికి ప్రతిపక్షాలు ఖాళీ

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**



జూబ్లీహిల్స్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబర్ 30: అధికారంలోకి వస్తామని కలలు కంటున్న కాంగ్రెస్, బీజేపీలు టికెట్ కేటాయింపుతోనే నీరసించిపోయాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. నామినేషన్లు వేసే నాటికి ఆ రెండు పార్టీలు ఖాళీ అవుతాయన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్, గౌతమ్‌నగర్, వినాయక్‌నగర్, దుర్గాభవానీగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా ప్రకటించడంతోనే సగం మంది నేతలు బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని, నామినేషన్లు వేసేవరకు ఎంతమంది ఆ పార్టీలో ఉంటారో తెలియదన్నారు. ఇక రాష్ట్రంలో అనేక స్థానాల్లో బీజేపీకి అభ్యర్థులే లేకపోవడంతో ఇప్పటిదాకా అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయలేదని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని ఢీకొట్టే సత్తా రాష్ట్రంలో ఏ పార్టీకి లేదని, హ్యాట్రిక్ సాధించి మరోసారి సీఎంగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, నాయకులు మామిడి నర్సింగరావు పాల్గొన్నారు.